
# కొత్త దారులు

కె. మమత



ప్రియమైన ఉష,

పెద్ద ఉత్తరం కావాలని డిమాండ్ చేశావు కదూ. నా ఉత్తరం చదువుతున్నప్పుడు నేను నీ పక్కనే వుండి మాట్లాడుతున్నట్టు, వాదిస్తున్నట్టు ఫీలవుతానన్నావు. ఈమేల్ ఇన్ఫర్మేషన్ కోసమే కానీ, ఫీల్ కాము, నిజమే, మళ్లీ మళ్లీ చదువుకోవాలని అనిపించదు. అందుకు కారణం మన అక్షరాలు మనకు లేకపోవడమే. మన చేతిరాత మన మనసుకు అద్దంలాంటిది. అప్పుడప్పుడు ఉత్తరాలు రాసుకుంటే మనం తిరిగి కలుసుకున్నట్టు వుంటుందన్నావు. నువ్వన్నది నిజం. ఉత్తరాలు రాసుకోవడమే చాలా బాగుంటుంది.

ఈరోజు నెల్సన్ మండేలా ఆటో బయోగ్రఫీ "లాంగ్ వాక్ టు ఫ్రీడమ్" చదువుతూ కూర్చున్నాను. టైం ఎలా గడిచిపోయిందో తెలీలేదు. బయట పోస్టు తెరిచిన చప్పుడు విని "అబ్బా అప్పుడే పోస్టమాన్ ఒచ్చే టైం అయిందా" అనుకుంటూ మండేలాను అయిష్టంగా పక్కనపెట్టి బయటకు వెళ్లాను. బయట చాలా చల్లగా వుంది. టెంపరేచర్ మైనస్ 2 డిగ్రీలు మరి. నిన్న రాత్రి మంచుపడి బయట అంతా తెల్లగా వుంది. సూర్యకాంతిలో మంచు మెరిసిపోతోంది. కొంతమంది కార్లను బయటకు తీయడానికి తంటాలు పడుతున్నారు. నిన్నంతా మబ్బుగా వున్న ఆకాశం ఈరోజు చాలా నిర్మలంగా వుంది. బోసిచెట్లు చల్లగాలిలో అల్లల్లాడుతున్నాయి. పోస్టమాన్ మాత్రం చెరగని నవ్వుతో పలకరించాడు.

"అయ్యో ఒక్క నిముషం ముందు బయటకు రావల్సింది. మీ వుత్తరాలేవో ఇచ్చేవాడిని. ఇప్పుడే బాక్సుకు తాళం వేసేశాను" అన్నాడతను.

అమెరికాలో అన్నీ చాలావరకు పకడ్బందీగా జరుగుతాయి. ఎవరైనా "అరె నేను పంపిన ఉత్తరం చేరలేదా? పోస్టలో ఎక్కడో మిస్సయినట్టుంది" అంటే వాళ్లు పచ్చి అబద్ధం చెప్తున్నారని లెక్క.

కథ

ఇక్కడ ఉత్తరం నీకు చేరకపోయినా కనీసం సెండర్‌కు వెనక్కి తిప్పి పంపిస్తారు. ఇలాంటి సర్వీసులు చూసే అనుకుంటా అమెరికాకు వచ్చినవాళ్లు ఇండియాకు వెళ్లిపోవాలని అంత సులభంగా అనుకోరు.

పోస్టమాన్ నా వైపు చెయ్యి వూపి "వాతావరణం చాలా బాగుంది. ఎంజాయ్" అంటూ వెళ్లిపోయాడు.

మైనస్ 2 డిగ్రీలను మంచి వాతావరణం అంటున్న అతని వైపు విచిత్రంగా చూశాను.

"ఈ చలికాలంలో సూర్యుని లేత కిరణాలు తాకడం మంచి కాలమే కదా" అన్నాడు గరాజ్ ముందు మంచు తీసేస్తున్న పక్కింటి అబ్బాయి.

"అవును నిజమే" అంటూ పోస్టబాక్సులోకి తొంగిచూశాను. ఈరోజు ఎన్ని బిల్లులు వచ్చాయో, ఫోన్‌బిల్లు, క్రెడిట్ కార్డు బిల్లు, వాటర్ బిల్లు" అని గొణుక్కున్నాను.

"మరి అమెరికానా? మజాకా?" అన్నాడు పక్కింటి అబ్బాయి మళ్లీ.

"ఏమిటి ఈరోజు అన్నీ సత్యాలే మాట్లాడుతున్నావు. ఫిలాసఫీ క్లాసులకు వెళుతున్నావా?" అన్నాను నవ్వుతూ.

అతను పెద్దగా నవ్వి, షవల్‌ను మంచులో గుచ్చి పైకి తీస్తూ "అమెరికాలో జీవించడంకన్నా మంచి ఫిలాసఫీ క్లాసు లేదు కదా" అన్నాడు.

"నేను నవ్వేసి "గుడ్ లక్ విత్ షవలింగ్" అని చెప్పి లోపలికి వచ్చేశాను.

"బిల్లులే కదా రాహుల్ వచ్చాక చూద్దాంలే అనుకుంటూ వాటిని సోఫాలో పడేసి పుస్తకం అందుకోబోయాను. అంతలో ఒక కవర్ మీద నీ చేతి రాత తళుక్కున మెరిసింది. ఆత్రంగా కవర్‌ను తెరిచాను. లెటర్‌తో పాటు నీ పెళ్లి ఆహ్వానపత్రిక, రిసెప్షన్ కార్డు, నిశ్చితార్థం రోజు తీసిన ఫొటోలు బయటపడ్డాయి.

"మండేలా నువ్వు కాసేపు ఆగాలి. నా ప్రాణ స్నేహితురాలు అన్ని పనుల మధ్య తీరిక చేసుకొని ఉత్తరం రాసింది" అనుకుంటూ ఉత్తరం చదివి తరువాత ఫొటోలు చూశాను.

సురేష్‌తో కలిపి తీసుకున్న ఫొటో నాకు చాలా నచ్చింది. మిగిలిన ఫొటోలూ బాగున్నాయి. కానీ మేకప్ తళుకుల్లో నీ కళ్లు బోసిగా కనిపిస్తున్నాయి. మేకప్ లేకుండా అందంగా వుంటావు నువ్వు. ఆ విషయం నువ్వు ఒప్పుకోవని తెలుసు. వెల్, మేకప్‌లో కూడా చాలా అందంగా వున్నావులే.

"ఉత్తరం వెంటనే చదివి, వెంటనే రిప్లై రాయి. ఏ పుస్తకమో చదువుకుంటూనో, ఆఫీసు పనుల్లోనో పడి రిప్లై రాయడం మర్చిపోయానంటే నీతో మాట్లాడను సుమా" అని బెదిరించావుకదా. అందుకని ఉత్తరం చదివి వెంటనే రిప్లై రాస్తునా .. నా కొత్త కాపురం గురించి ఎన్ని ప్రశ్నలు

నీకు. పెళ్లే చేసుకోను అని చెబుతూ నీకు చెప్పకుండా నేను పెళ్లి చేసుకున్నందుకు కోపం వచ్చిందన్నావు. అర్థం చేసుకుంటావో లేదోనని అప్పుడు చెప్పలేదు కానీ, నీ పెళ్లి, రిసెప్షన్ కార్డు చూశాక, నీ ఉత్తరం చదివాక చెప్పక తప్పదనిపిస్తోంది.

మన ఎనిమిదేళ్ల స్నేహంలో నా గురించి నీ దగ్గర దాచిందేమీ లేదు. మన ఆలోచనలను, భయాలను, ఇన్‌ఫాచువేషన్స్‌ని ఒకరికొకరం చెప్పు కున్నవాళ్లం. అయినా మనమధ్యలో అగాథం, వెలితి, ఏమిటో అర్థమయ్యేది కాదు ఇంతకుముందు.

పెళ్లి చేసుకోకూడదు అని గట్టిగా నిర్ణయించుకున్న తరువాత పరిచయమయ్యాడు రాహుల్. నేను చేయాలనుకున్న పనులు ఆగిపోతాయేమో నన్న భయంతో పెళ్లిమాట దాటవేస్తూ వచ్చాను. రాహుల్ కలిసిన మొదటిరోజునే మా ఇద్దరి ఆసక్తుల మధ్య పెద్ద వ్యత్యాసం ఉన్నట్లు అని పించలేదు. ఒకే ఆఫీసులో జాబ్ చేస్తున్నందువల్ల సాయంత్రాలు ఆఫీస్ నుంచి బీచ్‌కో, లైబ్రరీకో చెక్కేసేవాళ్లం.

ఒక సాయంత్రం ఇద్దరం బీచ్‌కు వెళ్లాం. అప్పుడప్పుడే చంద్రుడు సముద్రంలోంచి తొంగి చూస్తున్నాడు. దూరంగా ఒక క్రూయిజ్ ఫెర్రి వెన్నెల వెలుగులో సముద్రంలోకి సాగిపోతోంది. ఇద్దరం ఏమీ మాట్లాడకుండా వెన్నెలవైపు చూస్తూ కూర్చున్నాం. అప్పుడే రాహుల్ తన మనసులో మాట బయటపెట్టాడు.

"మన ఇద్దరి కలలూ ఒకటే కదూ" అన్నాడు.

చిర్నవ్వుతో తన వైపు చూశాను.

"ఐ థింక్ ఐ యాం ఇన్ లవ్ యు" అన్నాడు.

ఏమనాలో తోచలేదు నాకు. ఎందుకంటే అది ఒక స్టేట్‌మెంట్ మాత్రమే. కాని చాలా ప్రశ్నలున్న స్టేట్‌మెంట్.

చిరు చీకట్లో నిండు చందమామ వెలుగులో అలలు ఎగిరెగిరి పడుతున్నాయి.

"మనం పెళ్లి చేసుకుందామా?" అని అడిగాడు నిస్సంకోచంగా.

కాదనడానికి రాహుల్‌లో నాకెలాంటి లోపాలు కనిపించలేదు.

అప్పటికప్పుడే "ఓ.కే" అనాలనిపించినా చెప్పలేకపోయాను. మా అమ్మా నాన్నకు మాట మాత్రమైనా చెప్పకుండా ఓ.కే చెప్పాలనిపించలేదు. అంతేకాదు, రాహుల్‌ను అతని కుటుంబ సభ్యులమధ్య చూడాలనిపించింది. ప్రతి ఒక్కరూ ఒక్కొక్క సందర్భంలో ఒక్కోలా వుంటారు. ఆఫీసులో కనిపించే రాహుల్ వేరు. అతని అమ్మా నాన్న, అక్కా చెల్లెళ్ల మధ్య కనిపించే రాహుల్ వేరు. రోజూ కనిపించే రాహుల్‌ను కాక, తన మనుషుల మధ్య రాహుల్‌ను చూసి అప్పుడు నా నిర్ణయం చెప్పాలనుకున్నాను. ఆ మాటే రాహుల్‌తో అన్నాను.

"ఇది చాలా బాగుంది" అన్నాడు.

అయితే నాలా నువ్వు కోరుకుంటే ఇక్కడ మా అమ్మా నాన్న లేరు. వాళ్లు ఇండియా నుంచి విజిటర్స్‌గా ఇక్కడికి వచ్చేదాక వేచి వుందామా? అని అడిగాను.

"నువ్వు నీ పేరెంట్స్ లేకుండా ఎప్పుడున్నావు. ఎప్పుడు ఏ విషయం మాట్లాడుతున్నా వాళ్లను గుర్తు చేసుకోకుండా వుండవు కదా! నీ మాటల్లో నీ పేరెంట్స్‌ను వూహించుకోగలను" అన్నాడు.

"పెళ్లయిన తరువాత నాలో ఎలాంటి మార్పు వుండదు. పట్టుచీరెలు, నగలు పెట్టుకోను. నేను నమ్మని దేవుడికి నీ కోసం పూజలు చేయను. చదువుకుంటాను, రాసుకుంటాను. నాకిష్టం వచ్చినట్టు జుట్టు పెంచుకుంటాను. లేదా కత్తిరించుకుంటాను. సోషల్‌వర్క్ గురించి నా ఆలోచనలు మార్చుకోను. నా పేరు మార్చుకోనూ. మిసెస్ రాహుల్ అవను. ఇప్పటికీ ఎప్పటికీ నేను కరుణను. అంతే"



అదే వీకెండ్‌లో చికాగో వెళ్లాం. రాహుల్ అమ్మా నాన్న, అక్కా బావా వుంటారు అక్కడ. రాహుల్ చెల్లిని, ఆమె భర్తను కూడా రమ్మని ఫోన్ చేస్తే వాళ్లు పిల్లలతో సహా వచ్చారు. వీళ్లు కాలిఫోర్ని యాలో వుంటారు. అందరం రెండు రోజులు కలిసివున్నాం. చాలా బాగా గడిచింది. రాహుల్‌కు అతని సిస్టర్స్‌తో వున్న స్నేహం, అలాగే అతని పేరెంట్స్‌కు వారి కూతుళ్లతో వున్న అనుబంధం చూసి, నా నిర్ణయం చెప్పాను రాహుల్‌కు.

మరుసటి రోజు నేను రాహుల్ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నామని అమ్మా నాన్నకు ఫోన్‌లో చెప్పాను. ఏ విషయంలోనూ అమ్మా నాన్న ను పర్మిషన్ అడగని నేను ఎప్పటిలాగే వాళ్లకు ఇన్ఫర్మేషన్ ఇచ్చాను. వాళ్లు "కంగ్రాట్స్" చెప్పారు.

తరువాత రెండు నెలలకే "జస్టిస్ ఆఫ్ పీస్" ఇంటికి వెళ్లాం మేము. "జస్టిస్ ఆఫ్ పీస్" మా మ్యారేజీ సర్టిఫికెట్ మీద సంతకం పెట్టేసి "పెళ్లి సందర్భంగా శుభాకాంక్షలు. ఆనందంగా ఉండండి" అన్నాడు.


మా పెళ్లి ఫోటో చూసి "ఏమిటిది, కొంచెం మంచిగా అలంకరించు కుని తీసుకోవచ్చు కదా" అని రాశావు. మా పెళ్లి చాలా సింపుల్‌గా అయిపోయింది. రాహుల్ కుర్తా పైజామా వేసుకుంటే నేను కాటన్ చీర కట్టుకున్నాను. మేం ఇద్దరమే జడ్జి ఇంటికి వెళ్లిపోయాం. మాతో ఇంకెవరూ లేకపోవడం చూసి ఎన్నో సివిల్ మ్యారేజెస్ చూసిన ఆయన కూడా ఆశ్చర్యపడ్డాడు. మ్యారేజీ సర్టిఫికెట్ మీద సంతకం పెట్టిన తరువాత ఆయననే మా ఫోటో తియ్యమని అడిగాం. ఆయన మంచి జడ్జే కాని, మంచి ఫోటోగ్రాఫర్ కాదు. ఆ ఫోటో అంత బాగా రాకపోయుండొచ్చు, కలరింగ్, ఫోటోగ్రఫీ బాగుండకపోవచ్చు. కానీ ఒకరిలోకి ఒకరం ఒదిగిపోతూ జడ్జి ముందు నిల్చొని ఆనందంగా ఆ ఫోటోకు పోజ్ ఇవ్వడం ఎన్నటికీ మరిచిపోను.

మా పెళ్లికి శుభాకాంక్షలు చెబుతూ "నీ పద్ధతులు కొంచెం మార్చు కుని, కొంచెం సర్దుకుపోవడం నేర్చుకో" అని రాశావు. ఆ మాటే కొంత మంది స్నేహితులు కూడా చెప్పారు. అందరూ నా మంచి కోరే చెబు తున్నారని తెలిసినా,

"సర్దుకుపో" అనే మాట విన్నప్పుడల్లా నా మనసు తిరగబడేది.

ఎందుకు సర్దుకుపోవాలి?

పెళ్లికి ముందు మొదటిసారి అమెరికాలోనే వున్న రాహుల్ పేరెంట్స్‌ను కలవడానికి చికాగో వెళ్లామని రాశానుకదా. అప్పుడు నేను ఒంటరిగా వున్న సమయంలో ఒక మాట చెప్పాలనుకుంటున్నాను అని చాలా స్నేహంగా మా మామయ్య నాతో మాటలు కలిపారు. కాని మాటల మధ్యలో



> ఊరికే బాధపడుతూ వుంటే సరిపోదు. మనకు నచ్చనివి వదిలించుకుంటూ వుంటేనే మార్పు వస్తుంది. నలుగురు నడిచే దారి ఎప్పుడూ పాతదారే. దానివల్ల శాంతిగా వుండొచ్చేమో కాని, సంతోషంగా వుండలేరు. కొత్తదారులు వేసేవారే జీవితాన్ని వుత్సాహంగా, కొత్తగా జీవిస్తారు.

"భార్యభర్తలు రేఖల్లాంటి వారు. ఎవరికి వారు నేను మారను, ఇలాగే వుంటాను అనుకుంటే వాళ్లు ఎప్పటికీ కలిసివుండలేరు. ఇద్దరూ కొంచెంకొంచెం సర్దుకుంటూ పోతూ వుంటే ఎక్కడో ఒకచోట వారి భావాలు కలిసి హాయిగా ఉంటారు" అన్నారు. అనుభవంతో ఎంత చక్కగా చెప్పారు అనుకున్నాను. కానీ నా మనస్తత్వం నీకు తెలుసుగా. నా మనసు ఒప్పుకోలేదు. దీని సంగతేమిటో తేల్చుకోవాలనుకున్నాను.

చికాగో నుంచి తిరిగి వస్తున్న దారిలో విమానంలోంచి కిందికి చూస్తూ చాలాసేపు మౌనంగా కూర్చున్నాం. ఇక ఒర్చుకోలేక గబగబా అనేశాను.

"పెళ్లయిన తరువాత నాలో ఎలాంటి మార్పు వుండదు. పట్టుచీరెలు, నగలు పెట్టుకోను. నేను నమ్మని దేవుడికి నీ కోసం పూజలు చేయను. చదువుకుంటాను, రాసుకుంటాను. నాకిష్టం వచ్చినట్టు జుట్టు పెంచుకుంటాను. లేదా కత్తిరించుకుంటాను. సోషల్‌వర్క్ గురించి నా ఆలోచనలు మార్చుకోను. నా పేరు మార్చుకోను. మిసెస్ రాహుల్ అవను. ఇప్పటికీ ఎప్పటికీ నేను కరుణను. అంతే" అన్నాను గుక్క తిప్పుకోకుండా. రాహుల్ అంతా విని నన్ను చూసి నా నుదురు మీద ముద్దు పెట్టుకొని, పకపకా నవ్వాడు.

"కరుణా! నువ్వు చాలా ఓపెన్‌గా నీ మనసులో ఏముందో మాట్లాడేస్తావు. కానీ చాలామంది నిన్ను నమ్మరు. ఎవరైనా ఇంత ఓపెన్‌గా ఎలా వుంటారు అని అనుకుంటారు. నువ్వు మాట్లాడే విషయాలే సామాన్యమైనవి కావు. పక్కవాళ్లు నగల గురించి మాట్లాడితే నువ్వు నేటివ్ అమెరికన్ల చోకర్ల్ గురించి, దాన్నుంచి అమెరికన్ ఇండియన్ మూవ్‌మెంటు గురించి మాట్లాడతావు. సోషలిజం, క్లాస్‌లెస్ సొసైటీ అంటావు. గ్రామీణాభివృద్ధి అని, అమెరికా వదిలేసి ఇండియా వెళ్లిపోతానంటావు. ఇవన్నీ మెకానికల్‌గా జీవించేవారికి అర్థంకావు. చాలామంది కన్సర్వేటివ్‌గా తమ చుట్టూ గిరి గీసుకొని జీవిస్తారు. అవుటాఫ్ ది బాక్స్ ఆలోచించడం వాళ్లకు చేతకాదు, సరికదా ఎవరైనా అలా ఆలోచిస్తే పిచ్చోళ్లు అంటారు. అలాగే ఏమాత్రం మారకుండా భార్యాభర్తలు మనస్పర్థలు రాకుండా హాయిగా బతకొచ్చు అని ఊహించను కూడా లేరు. నువ్వంటే నాకిష్టం. నీ ఆలోచనలన్నా, కలలన్నా ఇంకా ఇష్టం. ఇపుడెలా వున్నావో అలాగే ఇష్టం. నువ్వు ఏమాత్రం మారినా ఇప్పటి కరుణలా ఎలా వుంటావు? ఈ కరుణనే కదా నేను ప్రేమిస్తోంది" అన్నాడు.

రాహుల్ చేతిని నా చేతుల్లోకి తీసుకుని అలాగే కూర్చుండిపోయాను.

ఏ ఆర్భాటాలు లేకుండా, ఎవరికీ పార్టీ ఇవ్వకుండా పెళ్లి చేసేసుకున్నందుకు కొంతమంది నవ్వుకున్నారు. నాకు బాగా తెలిసిన స్నేహితులు "మరీ అంత పిసినారిగా ఉండకు. మంచి ఉద్యోగం చేస్తున్నావు కదా. కొందరికైనా పార్టీ ఇవ్వు" అని అన్నారు.

రాహుల్ స్నేహితులైతే మరీ దారుణం. "ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని చేసుకున్నావు. పైగా రెడ్డిపిల్ల. కట్నం కూడా బాగానే ఒచ్చి ఉంటుంది. ఆ మాత్రం చిన్న పార్టీ ఇవ్వలేవా" అని కొన్ని రోజుల పాటు రాహుల్‌ను అడిగారు. రాహుల్ తన ఆఫీసులో వాళ్లకు ఏ సంజాయిషీ ఇచ్చుకోలేదు. నేను నా స్నేహితులకు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశాను. అది పిసినారితనం కాదు. ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా ఒక పాపాయిని దత్తత తెచ్చుకోవాలనుకుంటున్నాం.

దత్తతకు ఏవో లీగల్ ఇష్యూస్ ఉంటాయి. ఆ ఇష్యూస్ క్లియర్ అయిపోయేలోగా ఫైనాన్షియల్‌గా మేం కుదురుకోవాలని చూస్తున్నాం. ఇద్దరమూ ఇప్పుడిప్పుడే ఉద్యోగాలు మొదలుపెట్టినవాళ్లం. ఇన్ని ఆలోచనలు పెట్టుకుని, పెళ్లి అంత ఆర్భాటంగా చేసుకుని అన్ని ఖర్చులు పెట్టుకుంటే ఇక మేం చేయాలనుకున్నవి వచ్చే జన్మలో చెయ్యాల్సిందే అని.

ఇక్కడి స్నేహితులు కొంచెమైనా ప్రోత్సహిస్తారనుకున్నాను. కొందరు విచిత్రంగా చూశారు. ఇంకొంతమంది అసహ్యంగా ముఖం పెట్టి "ఎవరికో పుట్టిన పిల్లను తెచ్చుకుని మీ ఇంట్లో ఎలా పెట్టుకుంటారు" అని అన్నారు.

అమ్మ నాన్న లేని పిల్లలకు అమ్మను కావాలని నా కోరిక. వాళ్లతో ఏం మాట్లాడను? ప్రేమ ప్రేమ అంటారు. ఇదంతా ప్రేమ కోసమే అని ఎలా చెప్పను వాళ్లకు? కొంతమంది స్నేహితులైతే నాకు మెయిల్స్ చేయడమే మానేశారు. బాధగా వుంటుంది. నా ఇష్టాలు తప్పు కానప్పుడు నేనెందుకు మార్చుకోవాలి?

"నీ నిశ్చితార్థం వేడుక సమయం చాలా ఆర్భాటంగా జరిగిందని పెళ్లికి మరెంత ఖర్చు అవుతుందో. కానీ నేనేం చెయ్యగలను. నా పెళ్లి ఖర్చులకు దాచిన డబ్బు సరిపోదని అమ్మా నాన్న కొంత అప్పు కూడా చేయాలనుకుంటున్నారు" అని రాశావు.

అమ్మా నాన్నలకు బరువు కాకూడదని కొంతమంది పెళ్లి ఖర్చుల కని డబ్బు కూడబెట్టుకొని, కొంత అప్పు చేస్తున్నారు. కానీ ఒక్క క్షణమయినా "పెళ్లికి ఇంత ఖర్చు అవసరమా?" అని ఎందుకు ఆలోచించడం లేదు?

సాంప్రదాయం అంటావా, ఏం పెద్దపెద్ద షామియానాలు కాకుండా గుడిలోనే సింపుల్‌గా పెళ్లి చేసుకోవచ్చు. పట్టుచీరెలు, నగలు, అలంకారాలు లేకపోతే అరుంధతి కనబడకుండా సప్తరుషుల వెనుక దాక్కుంటుందా?

ఉషా! వూరికే బాధపడుతూ వుంటే సరిపోదు. మనకు నచ్చనివి వదిలించుకుంటూ వుంటేనే మార్పు వస్తుంది. నలుగురు నడిచే దారి ఎప్పుడూ పాతదారే. దానివల్ల శాంతిగా వుండొచ్చేమో కాని, సంతోషంగా వుండలేరు. కొత్తదారులు వేసేవారే జీవితాన్ని వుత్సాహంగా, కొత్తగా జీవిస్తారు. నువ్వూ ప్రయత్నించు. సాహసం చేయవే(రా) డింభకా!

ఎప్పుడూ నీ సంతోషం కోరుకునే

నీ

కరుణ

## పదిరెట్లు



"నాకు చెముడు వచ్చిందని చెప్పాడు డాక్టర్. ఇకనుంచి నా భార్య మాట్లాడే మాటల్లో పదిశాతమే వినిపిస్తాయని చెప్పాడు డాక్టర్" అన్నాడు లోకేష్.

"అబ్బ నువ్వు ఎంత అదృష్టవంతుడివిరా" అన్నాడు స్నేహితుడు.

"నా బొంద. ఈ విషయం తెలిసినప్పటి నుంచి నా భార్య పదిరెట్లు ఎక్కువగా మాట్లాడుతోంది" అన్నాడు లోకేష్ విచారంగా.